కథా కౌముది

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
26 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

# "పరిచితులు"

- శ్రీనాథ్ వాడపల్లి (New Jersey, USA)

**వర్షం వెలిసిన** ఉదయం తెలుస్తోంది. తడిసిన దిన పత్రిక ఫేస్ పేజీలో 'ప్రముఖ రచయిత సముద్రం ఒడ్డున....' మరి చదవలేక పోయాను. ఐనప్పటికీ మొదటి లైన్ అప్రయత్నంగా నా మస్తకంలోకి చొచ్చుకుపోయింది. ఏదో intuition మెదడులోంచి అప్రయత్నంగా నా ప్రాణ స్నేహితుడి వైపు ఆలోచింపచేస్తూ ఈ కల్పన.

{ఇందులో పాత్రలు రెండు. ఒక ఆడ ఒక మగ. ఒకరికొకరు పరిచయం లేదు. వయసు ప్రశ్న లేదు. ఇద్దరిదీ రైలు పట్టాల మాదిరి చెరో రహదారి. కానీ వారి స్వప్నాలు చేరువ. ఆమె నిత్య అన్వేషి – అతను సదా పదాన్వేషకుడు., ప్రకృతి నేపథ్యం }

ఒకానొక శ్రావణంలో

నిండు పున్నమి.

ఎదురుగా సముద్రం.

మేఘాల మాటున ఉన్న అతనిని ఆమె మీటింది.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం మాటలు.

ఆమె: మీరేనా ఆ చంద్రుడు?

అతడు: ఎవరు – "ఆ" ?

ఆమె: గుర్తులేదా..?....వెన్నెల... సముద్రం.......రాత్రి...... ప్రతిబింబం..... రంగుల మబ్బులు. నా చంద్రుడివే నువ్వు. నటించకు.

అతడు: రంగుల మబ్బులు?

ఆమె: అవును. తెల్లని ధనుస్సు

అతడు: నీ మాటలు సొగసు.

ఆమె: ఇన్నాళ్లు ఏమైపోయేవు? వెతుకుతూ ఉన్నాను.

అతడు: నేనిక్కడే. ఎదురుచూపుల్లో.

ఆమె: నన్ను గుర్తు పట్టినట్టు లేదు. సంగీతం కావాలి. ఆకలేస్తోంది. నేను నేల మీదకి రాలేను. కాఫీ తెస్తావా?

అతడు: నా దగ్గిర ముఖేశ్ ఉన్నాడు. సారంగా తేరి యాద్ మే ..

ఆమె: అది ఆ గుడిమెట్ల కింద టీ బడ్డీ వానిది.

అతడు: గుడిలో దేవుడెవరు? ఇదుగో బషీర్.

ఆమె: గోడలు మన మధ్య లేవు

అతడు: జడలో పాయలుండేవి?

ఆమె: ఉండు. నక్షత్రాల్ని చూడాలి.

అతడు: చంద్రుణ్ణి చూడు, వెన్నెల పలకరిస్తుంది.

ఆమె: నేను మాట్లాడను.

మౌనం.

పెదవులు మెదలడం లేదు.

మౌనం.

ఆకులు చాపుకొన్న కొబ్బరి నిలువుగా.

అక్కడక్కడా ఎండిన మట్టల రాపిడి శబ్దం.

ఇసక మీద పల్చగా పరుచుకొంటున్న కెరటాల మెత్తని సద్దు.

పదేసి కాళ్ళతో

అటూ ఇటూ హడావిడిగా ఎంఱ్డపీతల పరుగుల చప్పుడు.

ఆమె: బెంగగా ఉంటోంది ఈ మధ్య. చీకటంటే భయం. నన్నంటి ఉంటావు కదూ. చుక్కల నింగి కప్పుకొందాం. పెదాలు అప్పుడైనా కదుపుతావా.

అతడు: అల్పనా గుర్తొస్తోంది.

ఆమె: కొబ్బరి మొవ్వులో పడిన వెన్నెల ఆకుల నునుపుల మీంచి జారి

దిగూనున్న పచ్చగడ్డి పై పడి తుళ్లుతోంది.

వెన్నెల నీడలతో కూర్చున్న జాగా అంతా మోడరన్ మొజాయిక్ ఫ్లోరింగ్ డిజైన్ లా ఉంది.

అరిటాకుల ఉగిసలాటతో మా వైపు తిరగబోయిన గాలి –

సంపెంగ గుబురులో ఇరుక్కొని

విరజాజి పొదమీదా

మల్లెమొక్క మీదా

తూలీ సోలీ మరీ మమ్మల్ని తాకుతోంది..

దూరంగా ఇంటి పెరటిగోడ వారనున్న

కూరగాయల మళ్ళలో నీటి వంకాయల మీది నిగారింపులో

వెన్నెల వింతగా మెరుస్తోంది.

పెరటి మధ్యనున్న సాల పైకప్పు

వెన్నెట్లో కిరీటంలా ఉంది.

అతడు: నువ్వు అల్పనావి. నిన్ను అలానే పిలుచుకొంటాను. ప్రేమించొచ్చా?

ఆమె: ప్రేమించగలవా? ప్రేమించడం వొచ్చా? ప్రేమించేవా?

అతడు: లేఖలు, కథలు, కవిత్వం అన్నింట్లోనూ ఉన్నాను. ప్రేమికులకు నేను ఆదర్శం.

ఆమె: నీ రాతలంటే నాకు పిచ్చి. నువ్వు ప్రేమికుడివి.

ఇదుగో చూడు నా బంతిపూల జడ.

నా హృదయం నిండా పరిమళం.

నాకు పూలంటే ప్రేమ.

నేను ప్రేమని.

నా ఫలకం సినీవాలి

పాయల వాలు జడ చూడు. కెరటాల నడుము మీంచి ఎలా ప్రవహిస్తోందో.

......

నిశ్శబ్దం

ఆకాశంలో వన్నెల వెన్నెల గూడు కట్టుకొంది.

ఊదా రంగు మబ్బులు నెమ్మదిగా నల్లరంగులోకి మారుతూ నక్షత్రాల్ని కనిపించనీయడం లేదు. మాటలన్నీ మౌనం వైపు పరిగెడుతున్నాయి.

ఆమె: నీకు మౌనం నచ్చుతుందా? నిశ్శబ్దం నచ్చుతుందా?

హఠాత్తుగా

ఒక చినుకు ఆమె బుగ్గ మీద పడి హృదయంలోకి జారుకొంది. దూరంగా ఆకాశం మధ్యలోకి చీల్చినట్టు మెరుపు.

ఆమె: హత్తుకో నన్ను. ప్రేమించు. ప్రేమను తెలుసుకో. నువ్వు ప్రేమికుడివని నిరూపించుకో.

వెలిసిన వర్షంలో, పేపర్ని చేతిలో చుట్టగా చుట్టి – అటు సముద్రం దిక్కు మనుషులు గుమిగూడిన చోట పోలీసుల మధ్యలోంచి వెళ్లి మిత్రుణ్ణి ఆఖరు సారి చూసుకున్నాను.

అతగాడి మొహం మీద నేను మునుపు చూడని ఒక కొత్త చెదరని చిరునవ్వు.. మరణంలో.

దగ్గర్లోని గుడిసెలో అతను రాత్రి చీకట్లో తూలుతో వర్షంలో రోడ్ దాటుతోంటే చూసేట్ట .. పంచానామాలో బహుశా అదే ఖరారు కావొచ్చు.

నేను కొండమీది గుడిలో ఏ దేముడున్నాడో చూడ్డానికి ఒక్కొక్కమెట్టూ ఎక్కడం ప్రారంభించేను.

(నాన్నకి, కుప్పిలి పద్మ కు కృతజ్ఞతలతో)

*"The ancient Greeks called love "the madness of the gods."*
*Modern psychologists define it as the strong desire for emotional union with another person.*
*But what, actually, is love.?*
*It means so many different things to different people."*

***